# మళ్ళీ అమరావతి కథలు

సత్యం శంకరమంచి

## పందిరిపట్టి మంచం



గుళ్ళో పవళింపు సేవ జరుగుతోంది.

తలుపుల దగ్గర పాట సాగుతోంది. అమ్మవారి విగ్రహాన్ని తలుపుకవతల, అయ్యావారి విగ్రహాన్ని తలుపుకివతల పట్టుకునుంచున్నారు.

అమ్మవారివైపు నుంచి పాట......

నీవు నేనును పూల పాన్పున నిదురబోవుచు నుండగా
నీవు నేనని, లేపి ముద్దిడి, నీదు పేరున పిలిచెరా
ఆ వధూమణి ఎవతెరా నీ అంతరంగము దానిపై
తావలం బమరావతీపుర ధామ శ్రీ అమరేశ్వరా!

అలా అమ్మవారు నిలదీసి అడుగుతూ, చెప్తేగాని తలుపు తీయనంటుంటే ఆ వచ్చినావిడ గంగమ్మ అని చెప్తాడా ఆయన? ఏదో సమర్థకాలు చెప్పుకుంటున్నాడు సంసారం కోరినవాడై.

అమ్మవారి పాట లోపల్నించి దేవదాసీలు పాడ్తుంటే చినముత్తెం తనూ గొంతు కలుపుతూ అభినయిస్తోంది. చినముత్తెం కంఠం పావురాయి కువకువలా వుంటుంది. మల్లెతీగకు జోడు మామిడి పళ్ళు కాసినట్టుంది చినముత్తెం శరీరం. ఒక్క కంటిచూపుతో, పంటి బిగింపుతో, పెదవి మెదుపుతో పోతుటీగల్లాంటి సొగసుగాళ్ళని గులాములుగా చేసుకోగల అందగత్తె చినముత్తెం. కొంగు తగిలితే సరేసరి- ఆ కొంగు పైనించి వచ్చే గాలి తగిలితే చాలని ఎదురుచూస్తున్నవాళ్ళు అనేకులు. అయితే చినముత్తెం ఎవరికీ మనసు పెట్టలేదు. తల్లి పెదముత్తెం తొందరపెట్టనూ లేదు.

చినముత్తెం అభినయిస్తుంటే, ఆ కాలి గజ్జలు ఘల్లు ఘల్లుమంటుంటే మంటపంలోని జనానికి వొళ్ళు ఝల్లుమంటోంది. అలలు అలలుగా కదులుతున్న చేతులు, వొదిగి పారుతున్న నదిలా కదులుతున్న నడుము, మాట మాటకీ అంటుకుని విడిపోతున్న ఆ లేత పెదవులు, చెమటకు కరుగుతున్న బొట్టు, ఎగిరెగిరి పడుతున్న జడకుప్పెలు చూస్తూ బొమ్మలైపోయారు జనం. కాని చినముత్తెం జనంవైపు చూడదు. అలా దూరంగా చూస్తూ పాడుతుంది. ఆ చూపు నందీశ్వరుడిమీంచి స్వామివైపు పాకుతున్నట్టుంటుంది. ఆ అభినయం ఆ స్వామికోసమే అన్నట్టుంటుంది. పైపైకి, పైపైకి చూసే చినముత్తెం చూపు ఆ రోజున అక్కడే ఆగిపోయింది.

అవతలపక్కనుంచి బుల్లి రామయ్య శివుడు తరఫున పాడుతున్నాడు.

బుల్లిరామయ్య మిసిమి చాయవాడు- నూనూగు మీసాలవాడు. జరీ కండువా విశాలమైన ఛాతీమీద వేలాడుతుండగా గొంతెత్తి పాడుతున్న బుల్లి రామయ్యను చూసి చినముత్తేనికి వొళ్ళు జలదరించింది. ఎన్నిసార్లు చూసింది కాదు బుల్లి రామయ్యని! అయినా ఆ రోజు చినముత్తెం వూహలు, చూపులు బుల్లిరామయ్యని దాటి వెళ్ళలేకపోతున్నాయి.

'చేకోవే అమరావతి పురవరా శ్రీ బాలచాముండికా!'

అని బుల్లిరామయ్య పాడుతుంటే తన్నే పిలుస్తున్నట్టుంది చినముత్తేనికి. తన్ని ఆదుకోమంటున్నాడు! తన్ని గుండెలకు హత్తుకోమంటున్నాడు! చినముత్తెం పాపట గొలుసు పక్కకు జారింది. కొప్పనున్న నాగరం చెదిరింది. అడుగు తప్పింది. పైట జారింది. అది చూసిన పెదముత్తెం తాళం చిప్పతో కూతురు నెత్తిన ఒంగున మొట్టింది. తెలివొచ్చింది చినముత్తేనికి.

మూడో రోజు సేవలో చినముత్తెం బుల్లిరామయ్యని చూస్తూనే పాడింది. అతనికోసమే అభినయించింది. సేవ అయిపోయాక ప్రసాదాలు పెడ్తుంటే తనకు పెట్టిన ప్రసాదం పక్కనున్న బుల్లిరామయ్య చేతిలో పెట్టి పరుగు పరుగున ఇంటికెళ్ళింది. బుల్లిరామయ్య తెల్లబోయాడు.

పెదముత్తెం కూతురికి జడవేస్తూ 'ఏవే కాణీ లేనివాణ్ణి కట్టుకుంటావా? పెళ్ళాం బిడ్డలున్నవాడికి పెళ్ళాం అవుతావా?' అంటే చినముత్తెం వంచిన తల ఎత్తకుండానే బదులు చెప్పింది. 'అమ్మా! మనసు ఆయనదైన తర్వాత ఆయన కాణీ నాకెందుకమ్మా, నా కాసులు ఆయనివి కావా? ఆయన పిల్లలు నా పిల్లలు కారా? ఆయమ్మ నా అప్ప కాదా!' పెదముత్తెం మారు మాట్లాడలేదు. నిర్లిప్తంగా నవ్వుకుని కూతురు తల్లో పూలు పెడ్తూ 'మంచిరోజు చూసి అల్లుడిగారికి కబురుపెడ్తాను' అంది.

ఆనాటినుంచీ పెదముత్తెం ఇంటినుంచి బుల్లి రామయ్య ఇంటికి అన్ని సంబారాలు వచ్చేవి. ఏ లోటూ లేకుండా బుల్లిరామయ్య భార్యాపిల్లలు కాలం గడపడమే కాకుండా ఇంట్లో ఏ ఇబ్బంది వచ్చినా పిల్లలు పెదముత్తెం ఇంట్లోనే కాలక్షేపం చేసేవారు. చినముత్తేన్ని 'బజారమ్మా' అని పిలిచేవారు. పెదముత్తెం కూతురు ఆనందం చూసి తృప్తిగా వెళ్ళిపోయింది. చినముత్తెం బుల్లిరామయ్య కళ్ళలోకి చూస్తూ బొట్టు దిద్దుకుంటూ, ఆయన పలుకులో స్వామి పిలుపు వింటూ ముప్ఫయి ఏళ్ళు గడిపింది.

చివరి రోజుల్లో చినముత్తెం పట్టెమంచం మీద లేవలేక పడుకుంటే పక్కనే కన్నీళ్ళు పెట్టుకుంటున్న బుల్లి రామయ్యను చూసి 'తప్ప' అంటూ కొంగుతో అతని కళ్ళు అద్దింది. అదే పట్టె మంచం! పెదముత్తెం తమ ఇద్దరి కోసం చేయించింది. ఆ మంచానికి చుట్టూ అవే గాజుపూసల పేర్లు. 'పిల్లలు జాగర్త! అప్ప జాగర్త!' అంటున్న చినముత్తేన్ని చూసి బేజారయిపోతున్నాడు బుల్లిరామయ్య.

ఎక్కడలేని శక్తి తెచ్చుకుని కళ్ళు వెలిగిపోతుండగా చినముత్తెం ఆఖరి మాటలు చెప్పింది. 'సామీ! నేను నీకు ఏమిచ్చుకున్నానో తెలియదు. కాని పిల్లల కేపీ ఇవ్వలేదు. నేను పోయాక ఈ పట్టెమంచం మీ ఇంట్లో పడకగదిలో వేయించు. పిల్లలు పెద్దవాళ్ళయ్యాక పడుకుంటారు.'

అంతే- ఆనాటినుంచి బుల్లిరామయ్యగారి కొడుకులూ, కోడళ్ళు- మనవలూ, మనవరాళ్ళ శోభనాలు, కార్యాలకు ప్రత్యక్ష సాక్షి ఆ పట్టెమంచం!

